అంధకారంలో పల్లెలు

- దేవరాయపల్లె బిట్–2 పంచాయతీలో వెలగని వీధి దీపాలు
- ఇటీవల పాతలైన్ల స్థానంలో కొత్తలైన్ల ఏర్పాటు
- కొత్త స్తంభాలకు వీధి దీపాలను ఏర్పాటు చేయని వైనం
- రాత్రి వేళల్లో విషపురుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కాకూరువారిపల్లిలో నూతన విద్యుత్ స్తంభాలకు కనిపించని వీధిదీపాలు


కొత్త స్తంభానికి ఏర్పాటు చేయకుండా పాత స్తంభానికే వీధిదీపాన్ని వదిలేసిన దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండలం దేవరాయపల్లె బిట్–2 పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వీధి దీపాలు వెలగక చీకటి పడితే వీధుల్లో అంధకారం నెలకొంటోంది. ఇటీవల పాత విద్యుత్‌లైన్ల స్థానంలో కొత్తలైన్లను ఏర్పాటు చేశారు. కొత్త స్తంభాలకు వీధిదీపాలను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారంలో మగ్గుతున్నామని ప్రజలు వాపోతున్నారు. దేవరాయపల్లె బిట్–2 పంచాయతీ పరిధిలో వడ్డిపాళెం, కొత్తపల్లి, కాకూరువారిపల్లి, కచేరిదేవరాయపల్లె, వెంగమనాయుడుపల్లె గ్రామాలు ఉన్నాయి. ఇటీవల త్రీఫేస్ విద్యుత్ సరఫరా కోసం పాతలైన్ల స్థానంలో నూతన స్తంభాలు, కండక్టర్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పాత స్తంభాలకు ఉన్న వీధి దీపాలను కొత్త స్తంభాలకు ఏర్పాటు చేయకపోవడంతో చీకటిపడితే వీధుల్లో అంధకారం నెలకొంటోంది. ఈ కారణంగా విష పురుగుల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. త్వరలో వినాయక చవితి, దసరా పండగలు రానున్న నేపథ్యంలో పంచాయతీపాలకులు చొరవచూపి వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి దీపాలు వెలగడం లేదు



ఇటీవల కాకూరువారిపల్లిలో పాత లైన్ స్థానంలో కొత్త విద్యుత్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. కొత్త స్తంభాలకు వీధి దీపాలను ఏర్పాటు చేయకపోవడంతో చీకటి పడితే వీధుల్లో అంధకారం నెలకొంటోంది. వీధుల్లో విషపురుగులు తిరుగుతుండడంతో రాకపోకలు సాగించాలంటే భయమేస్తోంది. మరోవైపు మోటార్ సామర్థ్యం తక్కువగా ఉండడం, విద్యుత్‌లోఓల్టేజ్ సమస్యతో ట్యాంక్‌కు నీరు ఎక్కడం లేదు. దీంతో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాం.

– కాకూరు ప్రసన్నకుమార్‌రెడ్డి, కాకూరువారిపల్లి

తాగునీటికి కటకట

కాకూరువారిపల్లిలోని సుమారు 50 కుటుంబాలకు పెన్నా నదిలో ఏర్పాటు చేసిన మోటార్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. లోఓల్టేజ్ సమస్యకు తోడు మోటార్ సామర్థ్యం చిన్నది కావడంతో ట్యాంకుకు నీరు సరిగా ఎక్కడం లేదు. దీనికితోడు కొందరు రైతులు మెయిన్ పైప్‌లైన్‌కు రంధ్రాలు వేసుకుని తోటలకు నీటిని మళ్లించుకుంటుండడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న మోటార్‌కు బదులు సామర్థ్యం ఎక్కువ కలిగిన మోటర్‌ను ఏర్పాటు చేసి, వాటర్ చౌర్యాన్ని అరికట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సూర్యఘర్‌పై అవగాహన నేడు

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ జమీలాబేగం బుధవారం తెలిపారు. సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తోందని చెప్పారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కూడా లభిస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వింజమూరు సొసైటీ మాజీ డైరెక్టర్ మృతి



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చాకలికొండ గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, వింజమూరు సొసైటీ మాజీ డైరెక్టర్ పైడిమల్ల మాలకొండయ్య(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, వింజమూరు సొసైటీ మాజీ చైర్మన్ మలిరెడ్డి విజయకుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు అంకినపల్లి నారసింహరెడ్డి, తదితరులు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

క్లుప్తంగా

విద్యా సామగ్రి వితరణ



ఆత్మకూరురూరల్/ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు, ఆత్మకూరుకు చెందిన వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ ప్రణీత్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరులోని ఆది ఆంధ్ర, మురగళ్లలోని పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. డాక్టర్ కుమార్, విశ్రాంత హెచ్‌ఎం లక్కు ప్రసాద్, తోడేటి అశోక్ , రహీం, హెచ్‌ఎం నాగేంద్ర, ఉపాధ్యాయులు మాలకొండమ్మ, శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్త తోడేటి మల్లేశ్వరి, వేము ధీరేంద్ర, హరిబాబు, తరుణ్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణిగా వై పుణ్యవతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఎన్టీఆర్ జిల్లా ముప్ప ప్రాజెక్ట్‌లో సూపర్‌వైజరుగా పనిచేస్తూ సీడీపీఓగా పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి సీడీపీఓగా పనిచేస్తున్న సునీత తన యథాస్థానమైన నెల్లూరు ప్రాజెక్ట్ కార్యాలయానికి వెళ్లారు. నూతన సీడీపీఓకు ప్రాజెక్ట్ సిబ్బంది, అంగన్‌వాడీలు అభినందనలు తెలిపారు.

శ్రీనివాస కల్యాణ మహోత్సవం రేపు



ఉదయగిరి: పట్టణంలోని రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను పట్టణంలో బుధవారం అందజేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తదితరులు పాల్గొంటారని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభం



ఉదయగిరి: స్థానిక పాత సబ్‌ట్రెజరీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆత్మకూరు ఆర్డీఓ పావని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనానికి రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా అవగాహన కల్పించి చైతన్యపర్చాలన్నారు. తహసీల్దార్ రామ్మోహన్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమార్ ఏడీపీఎం మునిరత్నం, ఉదయగిరి డివిజన్ మాస్టర్ ట్రైనర్ రామమోహన్‌రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఉదయగిరి రూరల్: మండల ఇన్‌చార్జి ఎంఈఓ–1గా పని చేస్తూ సీతారామపురం మండల రెగ్యులర్ ఎంఈఓగా బదిలీ అయిన షేక్ మస్తాన్‌వలిని మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మస్తాన్‌వలి ఇన్‌చార్జి ఎంఈఓగా ఐదేళ్ల పాటు మండలంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎంఈఓలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా రామారావు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల డిప్యూటీ ఎంపీడీఓగా రామారావు నియమితులయ్యారు. వింజమూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రామారావుకు డిప్యూటీ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జెడ్పీ సీఈఓ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇప్పటి వరకు వింజమూరులో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న గోపి శ్రీనివాసులు వరికుంటపాడు ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)గా బదిలీపై వెళ్లారు. దీంతో రామారావుకు డిప్యూటీ ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయాలి


ఆందోళన చేపడుతున్న గిరిజనులు

ఉదయగిరి: తమకు ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీయం ఆధ్వర్యంలో బండగానిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామ గిరిజనులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కొత్తపల్లి గిరిజనులు ఎన్నో ఏళ్లుగా నివేశన స్థలాలు, పక్కాగృహాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా వారి తలరాతలు మారలేదన్నారు. రోడ్డు పక్కన చిన్న పూరి గుడిసెలు వేసుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజనులకు ఇళ్ల స్థలాలు చూపించి పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. ఎంపీటీసీ కాకు విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


సీతారామపురం: రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సాయిప్రసాద్

సీతారామపురం : ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలపై సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ సాయిప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఆయన అయ్యవారిపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీ–4 సర్వేను తక్కువగా చేసి ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. సకాలంలో పూర్తి చేయకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

వరికుంటపాడు: మండలంలోని వేంపాడు, రామాపురం, తిమ్మారెడ్డిపల్లి గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ గోపి శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనవెంట సీనియర్ సహాయకుడు వెంకటాద్రి ఉన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం తూర్పుపల్లి, మాముడూరు, చేజర్ల, ఆదూరుపల్లి, ఉన్నత పాఠశాలలను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బుధవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మనబడి మన భవిష్యత్తు ఫేజ్–2 కింద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శిథిలావస్థకు చేరిన ఏటూరి ఎస్సీ పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి నూతన గదులను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం నూతక్కివారికండ్రిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఎంఈఓ–2 డీసీ మస్తానయ్య ఉన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం


బస్సు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఆర్‌ఎం షమీమ్

ఉదయగిరి రూరల్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ప్రజారవాణా సంస్థ లక్ష్యమని నెల్లూరు రీజనల్ మేనేజర్ షేక్ షమీమ్ అన్నారు. ఉదయగిరి డిపోను బుధవారం ఆమె సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్న దృష్ట్యా డిపోలను తనిఖీ చేసి బస్సుల కండీషన్లు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా ఫుట్‌పాత్, ఎమర్జెన్సీ డోర్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రయాణికుల పట్ల డ్రైవర్లు, కండక్టర్లు ఎలా నడుచుకోవాలి, జీరో పేమెంట్ టికెట్ ఇష్యూలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాకు 24 కొత్త బస్సులు రాగా, అందులో ఏడింటిని ఉదయగిరి డిపోకు కేటాయించామన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా, మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైవర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ఆన్‌కాల్ డ్రైవర్లను నియమిస్తున్నామన్నారు. అనంతరం బస్సుల మరమ్మతు పనులను పరిశీలించారు. ఆర్‌ఎం వెంట ఎస్టీఐ నాగభూషణం, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతారామపురం : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆరు సహాయకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను బుధవారం తెలిపారు. బెడుసుపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త (జనరల్)తో పాటు సీతారామపురం బెస్తకాలనీ (బీసీ–ఏ), సీతారామపురం ఎస్సీ కాలనీ (ఎస్సీ), పడమటి రొంపిదొడ్ల(ఎస్సీ), పోలంగారిపల్లి (జనరల్), గుండుపల్లి (జనరల్), నెమళ్లదిన్నె (జనరల్)లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 21 నుంచి 35 ఏళ్లలోపు స్థానిక వివాహిత మహిళలు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోగా ఉదయగిరిలోని సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అల్లూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఏడు సహాయకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ వీ పద్మావతి బుధవారం తెలిపారు. బీరంగుంట–2 కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ)తో పాటు పట్టపుపాళెం–2 (బీసీ–ఏ), మోపూర్–2(ఓసీ), అల్లూరు గిరిజన కాలనీ (ఎస్టీ), పురిణి కొత్తపాళెం (బీసీ–ఏ), ఇందుపూర్–2(ఎస్సీ), అల్లూరు ఆర్డీఆర్ కాలనీ (ఎస్టీ), అల్లూరు హరిజనవాడ (ఎస్సీ) సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హత కలిగిన మహిళలు కావలి సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కలిగిరి: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్ పద్మజాకుమారి బుధవారం తెలిపారు. వీర్నకొల్లు మెయిన్ (ఓసీ), తెల్లపాడు మెయిన్ (ఓసీ), సిద్ధనకొండూరు మిట్టపాళెం (ఓసీ)లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. కొత్తూరు (ఓసీ), వీర్నకొల్లు మెయిన్ (ఓసీ) ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 26వ తేదీలోగా వింజమూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆత్మకూరు, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు–4, సహాయకులు –16 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పీ సునీలత బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆత్మకూరులోని ప్రాజెక్ట్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కిలో పొగాకు సగటు ధర రూ.235

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు సగటు ధర రూ. 235.37 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 474 బేళ్లను తీసుకురాగా, 241 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.235.37 ధర పలికిందని వివరించారు.

డీసీపల్లిలో 193 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 193 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 360 బేళ్లు రాగా, 193 బేళ్లను కొనుగోలు చేశారని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.150, సగటున రూ.219.43 ధర పలికిందని వివరించారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి


అనుమసముద్రంపేట: వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని రాజవోలులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన సూరం ప్రసాద్ రెడ్డి రోజూ మాదిరిగానే రెండ్రోజుల క్రితం తన గేదెను మేత కోసం పొలాల్లోకి తోలగా సాయంత్రం ఇంటి తిరిగి రాలేదు. బుధవారం సమీపంలోని అటవీ ప్రాంతంలో వెతకగా ఓ చోట చనిపోయి కనిపించింది. వన్యప్రాణులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన కరెంటు తీగలు తగిలి షాక్‌తో చనిపోయినట్లుగా గుర్తించారు. గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, గేదె మృతితో కుటుంబ జీవనాధారాన్ని కోల్పోయామని బాధితులు వాపోయారు. అటవీ ప్రాంతంలో దుప్పుల కోసం కొందరు విద్యుత్ తీగలును ఏర్పాటు చేస్తున్నారని, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

హిరోషిమా డే



సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హిరోషిమా డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ ప్రధాన బాధ్యులు ఏవీ రమణయ్య మాట్లాడుతూ జపాన్‌లోని హిరోషిమా నగరంపై అమెరికా లిటిల్ బాయ్ అనే కోడ్ నేమ్ కలిగిన అణుబాంబును వేయడంతో అపారమైన విధ్వంసంతోపాటు భారీ ప్రాణనష్టం జరిగిందన్నారు. దాదాపు 1.40 లక్షల మంది మరణించారన్నారు. రేడియేషన్ ప్రభావంతో దీర్ఘకాలికంగా అనేక మంది ఇబ్బందులకు గురయ్యారన్నారు. అలనాటి బాధితులను స్మరించుకునే దిశగా హిరోషిమా డేను ప్రపంచ అణ్వాయుధ నిషేధ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లుగా తెలిపారు. జేవీవీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం



ఆత్మకూరురూరల్: పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో బీజేపీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 13న నెల్లూరు పర్యటనకు బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రానున్నారని, ఆయన పర్యటనను బీజేపీ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కరటంపాటి సుధాకర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అలఘునాథస్వామి ఆలయంలో విశేష పూజలు


విశేషాలంకరణలో దేవదేవేరులు


కలశ పూజ నిర్వహిస్తున్న వేదపండితులు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలోని పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో పుష్కర కుంభాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండో రోజు బుధవారం వేకువజాము నుంచి విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ పక్కనే ఉన్న కల్యాణ మండపంలో మహిళలు కోలాటాన్ని ప్రదర్శించారు. దాత కంచి పరమేశ్వరరెడ్డి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ పావని

ఉదయగిరి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆత్మకూరు ఆర్డీఓ పావని అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌డేలో ఆర్డీఓ పాల్గొన్నారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 76 అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి పదహారు డెత్ కేసులు గుర్తించామన్నారు. వాటిని తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదుచేసి పథకం లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టామన్నారు. 125 మంది రైతులకు సంబంధించి ఆధార్ నంబర్ల నమోదులో తప్పిదాలు చోటు చేసుకున్నాయని, వాటిని 15 రోజుల్లో సరిచేయాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్ రామ్మోహన్, ఎంపీడీఓ అప్పాజీ, సీఐ వెంకట్రావు, రేంజ్‌అధికారి కుమార్‌రాజా, సబ్‌రిజిస్ట్రార్ మెల్కీరోషన్, డీటీ షాజియా, రీసర్వే డీటీ శ్రీనివాసులు, ఇరిగేషన్, హౌసింగ్ డీఈఈలు చంద్రమౌళి, పీరాన్ , సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయభాస్కర్

ఉదయగిరి రూరల్ : రైతుసేవా కేంద్రంలోని వీఏఏలను సంప్రదించి రైతులు సాగుచేసిన పంటలను నమోదు చేయించుకోవాలని ఏఓ విజయభాస్కర్ సూచించారు. మండలంలోని నేలటూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ నగదు జమకాని వారు ఆధార్‌కార్డు, పొలం పాస్ పుస్తకం నకలుతో రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. పొలానికి ఆధార్ లింకు లేనివారు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి లింకు చేయించుకోవాలని తెలిపారు. వీఏఏ వెంకటేశ్వర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో ఏఓ శశిధర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, వీఏఏ సుజాత, పీఎస్ ఉదయ్, రైతులు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు తొలిటీకా


ఉదయగిరిరూరల్: గర్భిణులకు సారె అందజేస్తున్న జీఎంకే ట్రస్ట్ ప్రతినిధులు


ఆత్మకూరురూరల్: పోషకాహారం పంపిణీ చేస్తున్న సీడీపీఓ సునీలత


కొండాపురం: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మజ

కొండాపురం : తల్లి ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని, బిడ్డ పుట్టిన వెంటనే తాపడం వల్ల వ్యాధులు దరిచేరవని వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మజ అన్నారు. మండలంలోని గరిమెనపెంట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

ఉదయగిరి రూరల్: గండిపాళెం దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా 12 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. జీఎంకే ట్రస్ట్ అధినేత, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి తన ప్రతినిధులతో సారెను అందజేశారు.

సీతారామపురం : సింగారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

సంగం: దువ్వూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని సాతానుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత తల్లిపాల విశిష్టత, పోషకాహారంపై అవగాహ కల్పించారు.